"వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు అని ఎన్నడూ ఆయన నాకు తెలిసి ఎవరి గురించీ మాట్లాడలేదు."

"సరే. ఆయన ఆశీర్వచనం వల్ల ఎవరికైనా వివాహం అవడం, పిల్లలు పుట్టడం లాంటి మహత్తులు జరిగాయా?"

"చాలాసార్లు. కాని ఆయన మాత్రం అది తన మహత్తు వల్ల జరగలేదని, దేవుడికే కృతజ్ఞతలు తెలియచేయమని చెప్పి పంపించేస్తూంటాడు."

"ఐతే క్షణం ఆలస్యం చేయను. పద. నేను ఎలాంటి మహాత్ముడి కోసం ఇంతకాలం వెదుకుతున్నానో అలాంటి ఆయన్ని దర్శించబోతున్నాను." ఆనందంగా చెప్పాడు రామానందం.

## 72. దైవం మానుష రూపేణా...

ఓ మనిషి ఓ గుంతలో పడి ఎంత ప్రయత్నించినా బయటకి రాలేకపోతున్నాడు.

"నిన్ను చూస్తే నాకు గుండె తరుక్కు పోతోంది." ఓ సున్నిత మనస్కుడు అతడ్ని చూసి చెప్పాడు.

"గుంత ముందు హెచ్చరిక బోర్డు పెట్టాల్సింది." ఓ ప్రాక్టికల్ మనిషి చెప్పాడు.

"నువ్వు గోతిలో పడనట్లుగా ఊహించుకో. ఏ బాధా ఉండదు." అటుగా వెళ్ళే ఓ వేదాంతి చెప్పాడు.

"చెడ్డవాళ్ళే గోతిలో పడేది." ఓ మతాధికారి చెప్పాడు.

"నీ కోసం నేను దైవ ప్రార్థన చేస్తాను." ఓ భక్తుడు చెప్పాడు.

"ఎలా పడ్డావు? ఆ గోతి లోతెంత? పడ్డాక నీ అనుభూతి ఏమిటి?" టి. వి జర్నలిస్ట్ అడిగాడు.

"మనుషులే గోతుల్లో పడేది." హేతువాది చెప్పాడు.

"ఇంతకన్నా పెద్ద గోతిలో ముందు ముందు చాలాసార్లు పడతావు జాగ్రత్త." నిరాశావాది హెచ్చరించాడు.

"నువ్వు ఎవరికీ కనపడనంత లోతు గుంతలో పడలేదు. అదృష్టం." ఆశావాది చెప్పాడు.

గోతిలోని ఆ మనిషిని చూసి అటుగా వెళ్తున్న శ్రీరామ చంద్రుడు అనే అతను 'అయ్యో!' అని అందరినీ పిలిచి వారి సహాయంతో ఆ మనిషిని గోతిలోంచి బయటకి తీసాడు.

నీతి: మనని కష్టాల్లో ఆదుకునేది ఒక్క భగవంతుడే. ఆ పనిని తరచు సాటి మనుషుల ద్వారా చేయిస్తూంటాడు.

## 73. దైవ సహాయం

హిమాలయాల్లోని కేదార్‌నాథ్ దేవాలయం మే నించి అక్టోబర్ దాకా ఆరు నెలలు తెరుస్తారు. అక్టోబర్ నించి మళ్ళీ మే దాకా అక్కడ కురిసే మంచు వల్ల మూసేస్తారు. ఓ భక్తుడు అక్టోబర్‌లో ఓ రోజు కేదార్‌నాథ్‌కి చేరుకున్నాడు. ఆ రోజే గుడిని మూసేరోజు అని అతనికి అక్కడికి వచ్చే దాకా తెలీదు. ఇంకో గంటలో గుడి మూసేస్తారని తెలిసి, భోజనం కూడా చేయకుండా కేదార్‌నాథ్ శివలింగాన్ని దర్శించాలన్న తపనతో అతను ఆలయ ప్రధాన ద్వారం దగ్గరకి చేరుకున్నాడు. ఐతే అప్పటికే ఆలయ ద్వారాన్ని పూజారి మూసేసాడు.

"స్వామీ! ఒక్కసారి సింహద్వారం తెరిస్తే కేదారేశ్వర్‌ని దర్శించుకుని వెళ్ళిపోతాను." కోరాడతను.

పూజారి ఇక తలుపు తీయనన్నాడు.

"చాలా దూరం నించి వచ్చాను స్వామి. దయచేయండి." దీనంగా అడిగాడా భక్తుడు.

పూజారికి కనికరం లేకపోయింది. ఆలయ ద్వారానికి తాళం వేసి వెళ్ళిపోయాడు. ఆరు నెలల తర్వాత మే నెల్లో పూజారి ఆలయాన్ని తెరవడానికి వస్తే, ఆ భక్తుడు అక్కడే ఇంకా నిలబడి తన కోసం ఎదురు చూస్తూండటం గమనించి ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేమిటి? నువ్వింకా వెళ్ళలేదా?"